

అన్నదానానికి విరాళాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక శ్రీకాళహస్తీశ్వర స్వామి నిత్యాన్నదాన పథకానికి శనివారం పలువురు దాతలు ఆర్థిక విరాళాలు అందజేశారు. బెంగళూరుకు చెందిన బాలసుబ్రమణ్యం దంపతులు రూ. లక్ష, సికింద్రాబాద్ కు చెందిన రంభ, రాజేష్ దంపతులు రూ. 50 వేలు చెక్కు రూపంలో ఆలయాధికారులకు అందజేశారు. నిత్యాన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా కోరారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల దర్శనం చేయించారు.



ప్రాణాలైనా వదులు కుంటా..

ఎయిర్‌పోర్టుకు భూములు ఇచ్చేది లేదు..

విలేకర్ల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేసిన భూ బాధిత రైతులు

ప్రజాశక్తి- శాంతిపురం: తమ ప్రాంతంలో ఎయిర్పోర్ట్ వద్దు అని, తమ భూములు తమకు ముద్దు అని కుప్పం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ బాధిత రైతులు పేర్కొన్నారు. శనివారం ఎయిర్పోర్ట్ బాధిత రైతులు మండల కేంద్రంలోని బడుగుమాకులపల్లి వద్ద విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిపురం మండలం అమ్మవారిపేట, సొన్నేగానిపల్లి, కొలమడుగు, దండికుప్పం రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులందరూ చిన్న సన్నకారుల రైతులేనన్నారు. ఇక్కడ అందరికీ ఒక ఎకరా రెండు ఎకరాలు లేదా ఐదు ఎకరాలు భూములు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ భూములను తరతరాలుగా వారసత్వంగా పొంది ఎంతో కష్టపడి అప్పులు చేసి భూములను వ్యవసాయానికి అనుగుణంగా మార్చుకున్నామన్నారు. ఈ ప్రాంతం మెట్ట భూమి కావడంతో అత్యధికంగా బోర్లు వేసి ఒకటో రెండో బోర్లలో వచ్చే నీటితో బంగారం లాంటి పంటలను పండిస్తున్నామన్నారు. సంవత్సరానికి మూడు పంటలు పండించే సారవంతమైన భూములను ప్రభుత్వం ఏర్పాటు పేరుతో బలవంతపు భూసేకరణ చేయడం చాలా దారుణమన్నారు. 2013 భూసేకరణ చట్టానికి విరుద్ధంగా భూములను లాక్కొని రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 2014లో 450 ఎకరాలను ఎయిర్ పోర్టు కొరకు భూసేకరణ చేసి ఇప్పటివరకు పునాది రాళ్లు కూడా వేయలేదన్నారు. ఇక్కడ ఏర్పోర్ట్ వస్తే స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ఎలాంటి ఉపయోగం ఉండని అన్నారు. ప్రభుత్వం చెప్పే విధంగా వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి గాని ఇంకో రకంగా ఏమైనా ఎగుమతులు చేయడానికి ఈ ప్రాంతంలో అలాంటి పారిశ్రామికవేత్తలు ఎవరూ లేరన్నారని, అదే ఎయిర్పోర్టుకు బదులు పరిశ్రమలు తీసుకొని వస్తే నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలను కల్పించిన వారవుతారన్నారు. తాము అభివృద్ధికి ఎన్నడూ అడ్డు కాదని ప్రజాపయోగకరం ఏమైనా పరిశ్రమలు తీసుకుని వచ్చి అభివృద్ధి పరిస్తే సంతోషిస్తామన్నారు. ఈ విషయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజుతో కలిసి విజయవాడలో శుక్రవారం సీసీఎల్ఏ ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, ఆర్అండ్ ఆర్ కమిషనర్‌కు రైతుల సమస్యలను తెలియజేశామని తెలిపారు. రైతుల సమస్యల పట్ల వారు సానుకూలంగా స్పందించారని, చాలామంది రైతులను రెవెన్యూ అధికారులు భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తాము ప్రాణాలైనా వదులుకునేందుకు సిద్ధమని, అంతేకానీ ఎయిర్ పోర్టు కోసం భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు చక్రపాణిరెడ్డి, పెద్దన్న, జయప్ప గౌడు, సోమప్ప, సుబ్రహ్మణ్యం, జ్ఞానేంద్ర, మనీ, జీవరత్న, సత్యమ్మ, పద్మమ్మ, సులోచనమ్మ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కుప్పం ఎయిర్‌ఫోర్టు భూ బాధిత రైతులు

మామిడి రైతుల బెంగ తీరేనా..?

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఏడాది పాటు కష్టించి పండించిన పంటకు మద్దతు ధర రాకపోగా మామిడి తోటల్లోనే రాలిపోతుంటే మామిడి రైతుల గుండెలు అవిసిపోతున్నాయి. కొందరైతే పంటను కోయకుండానే తొటల్లోనే వదిలేస్తున్నారు.. జ్యూస్ ఫ్యాక్టరీల యాజమాన్యం సిడికేట్, ర్యాంపుల దోపిడీ మామిడి రైతును నిలువునా ముంచేస్తున్నాయి. ఎన్నడా లేని విధంగా మామిడి అమ్మకాల్లో కూటమి ప్రభుత్వంలో రాజకీయ జోక్యం పెరిగింది. స్థానిక నేతలు రాత్రంబవళు జ్యూస్ ఫ్యాక్టరీ వద్దే ఉంటూ పర్మిట్లు, టోకెన్లు కమీషన్లకు అమ్ముకుంటున్నారు. ఈ పరిస్థితి ఎంతదాకా వచ్చిందంటే ఏడాది పాటు కంటికి రెప్పలా కాపాడుకొచ్చిన పంటను అమ్ముకోవాలంటే స్థానిక రాజకీయ నేతల కాళ్ళావేళ్ళాపడాల్సిన దుస్థితి..

ప్రజాదృష్టి

జిల్లా వ్యాప్తంగా 40 వేల హెక్టార్లలో ఈ ఏడాది ఐదు లక్షల టన్నుల మామిడి దిగుబడి వచ్చింది. దిగుబడిచూసి మురిపోయిన రైతు ఆనందం ఎంతో కాలం పట్టలేదు.. పంటను అమ్ముకునేందుకు దిక్కుతోచక అల్లాడుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర అంటూ జ్యూస్ ప్యాక్టరీలు రూ. 8, ప్రభుత్వ సబ్సిడీ రూ. 4 ప్రకటించినా కొనేనాధుడే కరువైయ్యారు. జిల్లా వ్యాప్తంగా 70వేల మంది మామిడి రైతులు నష్టపోయారు. మామిడి రైతును ఆదుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాగం పూర్తిగా విఫలమైందంటూ రైతుల సంఘాలు ఆందోళనలకు సిద్ధమయ్యాయి. మరో వైపు మోడల్ పాఠశాలల పేరిట గ్రామానికో మోడల్ పాఠశాల ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం సమీప గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడంతో జిల్లా వ్యాప్తంగా మా ఊరి బడి మార్చవద్దు అంటూ నిరసనలు వెళువెత్తున్నాయి. ప్రతి రోజూ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో తమ గ్రామంలో బడిని మార్చొందంటూ విద్యార్థుల తల్లింద్రదులు ప్రభుత్వ తీరును నిరశిస్తూ ఆందోళనలు చేస్తున్నారు. రెండు, మూడు కిలో మీటర్ల దూరం ఉన్న పాఠశాలకు విద్యార్థులు వెళ్ళడం ఎలా అని ప్రశ్నిస్తున్నారు.



ధర లేక చిత్తూరులో ఉచితంగా మామిడి కాయలు పంపిణీ చేసిన దృశ్యం (ఫైల్ ఫొటో)

జిల్లాలో యోగాంధ్ర విజయవంతం : కలెక్టర్



చిత్తూరులో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి- యంత్రాంగం: ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం గడపడానికి దైనందన జీవితంలో యోగా సాధన నిరంతర ప్రక్రియగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం చిత్తూరు జిల్లా కేంద్రంలోని డిఎస్ఏ క్రీడామైదానంలో యోగాంధ్ర ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పి మణికంఠ చందోలు, జేసి జి.విద్యాధరి, డిఎఫ్ఓ భరణి, నగరపాలక మేయర్ అముద, చుడా ఛైర్మన్ కఠారి హేమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో మే 21 నుండి జూన్ 21 వరకు నెల రోజులు యోగాంధ్ర కార్యక్రమాలు రెవెన్యూ, టూరిజం, తదితర శాఖల సమన్వయంతో నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో యోగాంధ్రలో భాగంగా 7 ప్రదేశాలలో భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించగా అందులో పులిగుండు, బోయకొండ, కాణిపాకం, కంగుంది వంటి నాలుగు పర్యాటక స్థలాలలో కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 20వేల మంది పాల్గొన్నారు. అనంతరం ప్రముఖుల చేతుల మీదుగా మెగా ట్రైనర్స్ ఎం.విశాల్, రెడ్డి మస్తాన్, రాధిక, సునీత ప్రేమ్ రాయి ప్రశంసపత్రాలు, మెమొంటోలు అందజేశారు. అలాగే యోగ గురువులైన శ్రీనివాస్ నాయుడు, బాబు నాయుడుకు ప్రశంసా పత్రాలు, అందజేశారు. చిత్తూరు నగరంలోని సంతపేట నాగాలమ్మ గుడి వద్ద ఉన్న బృందావన్ సిబిఎస్ఈ పాఠశాల్లో ఘనంగా యోగా డే నిర్వహించారు. చిత్తూరు అపోలో యూనిర్సిటీలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అపోలో యూనిర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ ఆధ్వరంయలో అపోలో నాలెడ్జ్ సెంటర్ గ్రౌండ్‌లో 1000 మంది విద్యార్థులు, 200మంది సిబ్బంది సామూహిక యోగా ప్రదర్శన నిర్వహించారు.

బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని క్రీడామైదానంలో యోగాంధ్రాను పురస్కరించుకొని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ యోగాసనాలు వేశారు. సోమల మండలంలోని వడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, నంజంపేట ఉన్నత పాఠశాల, సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహసిల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో నారాయణ, ఎంఈఓ శివరత్నమ్మ యోగా దినోత్సవం నిర్వహించారు.

వికోటలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన యోగ కార్యక్రమానికి చిత్తూరు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు విచ్చేశారు. ప్రస్తుత జీవనశైలిలో ప్రతి ఒక్కరు యోగాను దినచర్యగా మార్చుకోవాలని సూచించారు. అనుమేపల్లి అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో అంగన్వాడీ సిబ్బంది యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. గంగాధర నెల్లూరు మండలం లోని తూగుండ్రం గ్రామం లో జడ్పీ హైస్కూల్లో యోగ కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సమకూర్తుందని కూటమి నాయకులు మణి వర్మ అన్నారు.

కార్వేటినగరం ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించరు. ఎంపిడిఓ చంద్ర మౌళి మండల స్పెషల్ ఆఫీసర్, కార్వేటినగరం మండలం ఫారెస్ట్ రేంజర్ వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొని విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. బైరెడ్డిపల్లి మండలంలో ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, తహశీల్దార్ ప్రసన్న కుమార్, బైరెడ్డిపల్లి, తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయ్ చందర్, డాక్టర్ అరుణ కుమార్ యోగా కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఆర్ పురంలోని ముద్ధికుప్పంలో ఎంపీడీవో మోహన్ మురళి, కటికపల్లెలో ఏపీవో లలిత, కొత్తపల్లి మిట్ట జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంఈఓ సబర్మతి పాల్గొన్నారు. యాదమరిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఆధ్వరంలో హెల్త్ సూపర్వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కడా ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 5000 మందికి పైగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో కడా పీడీ వికాస్ మరమ్మత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం తెలిపారు. చిన్నారి తేజశ్రీ చేసిన యోగ ఆసనాలు కార్యక్రమానికి ప్రత్యేకంగా నిలిచి, చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కడా పీడీ చిన్నారి తేజశ్రీని అభినందించారు. రొంచెర్ల మండలం ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో పుంగనూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి చల్లా బాబురెడ్డి పాల్గొని యోగాసనాలు వేశారు. పెద్దపంజాణిమండలంలోని అన్ని గ్రామాల్లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో బాలాజీ, తహశీల్దార్ అనిల్ కుమార్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి పాల్గొన్నారు. పలమనేరులో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో కోర్టు ఆవరణలో పలమనేరు సీనియర్ సివిల్ జడ్జ్ ఆదినారాయణ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు జరిగాయి. రామకుప్పంలో పిడి రవికుమార్, తహశీల్దార్ కౌలేష్, ఎంపీడీవో మురలీధర్ రెడ్డి, ఏపీఓ గణేష్ ఆధ్వర్యంలో మండలంలోని 23 పంచాయతీల్లో ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. శాంతిపురంలోని శ్రీపరమహంస యోగానంద విద్యాలయంలోఅంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. మండల విద్యాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చిత్తూరు అపోలోలో





వీకోటలో పాల్గొన్న జెడ్‌పి ఛైర్మన్



కుప్పంలో కడా పీడీ ఆధ్వర్యంలో

గుజ్జు పరిశ్రమలను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని గుజ్జు పరిశ్రమలను శనివారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మామిడి గుజ్జు పరిశ్రమలు, ర్యాంపులు వద్ద పనితీరును పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరల ప్రకారమే కొనుగోలు చేయాలని ఆయా పరిశ్రమల యాజమాన్యాన్ని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం రైతుల సమస్యలు నేరుగా విని, సంబంధిత అధికారులతో చర్చించి తక్షణమే పరిష్కారం చూపేందుకు కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.



జ్యూస్ ఫ్యాక్టరీలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

బడిని మార్చకండి సారూ..

కలెక్టర్‌ను ఆశ్రయించిన విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మా ఊరి బడిని మార్చ వద్దు అంటూ బైరెడ్డిపల్లి మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉందని అందులో 36 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. అయితే ప్రసుత్తం పాఠశాలలోని 3, 4,5 తరగతుల విద్యార్థులను గ్రామం నుంచి రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న మరో పాఠశాలకు మార్చడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లి వచ్చే దారిలో వ్యవసాయ బావులు, వంకలు దాటుకుని వెళ్లాల్సి ఉందని తమ గ్రామంలోనే పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు.



కలెక్టరేట్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

మామిడి రైతులను ఆదుకోవాలి..

కలెక్టరేట్ ఎదుట రైతులు, రైతు సంఘాల నేతల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, సంఘం నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మామిడి రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందంటూ మామిడి రైతుల సంక్షేమ సంఘం నేతృత్వంలో రైతు సంఘాల నేతలు, రైతులు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు హేమలత, రామానాయుడు, జనార్ధన్ మాట్లాడుతూ ఏటా నష్టపోతున్న మామిడి రైతులను ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అత్యంత దారుణమైన పరిస్థితికి తీసుకొచ్చిందన్నారు. జిల్లాలో ఎక్కడా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు జ్యూస్ ఫ్యాక్టరీ రైతుల నుండీ మామిడిని కొనుగోలు చేయడం లేదన్నారు. ఓ వైపు జ్యూస్ ఫ్యాక్టరీ, మరోవైపు ర్యాంపులు మామిడి రైతును దగా చేస్తున్నా ప్రభుత్వం, జిల్లా యంత్రాగం ఏం చేస్తోందని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా కష్టించి పండించిన మామిడిని అమ్ముకొలేని దుస్థితిలో రైతులు కొట్టిమిట్టాడుతున్నట్లు చెప్పారు. అనేక మంది తమ పంటను తోటల్లోనే వదిలేస్తున్న విషయం తెలియడం లేదా అని ప్రశ్నంచారు. జిల్లాలో పండిన మామిడిని పూర్తిగా కొనుగోలు చేయాడమే కాకుండా దిగుబడికి పూర్తిగా ప్రభుత్వం అందించే సబ్సిడీ వర్తింపజేయాలని కోరారు. జిల్లాలో నెలకొన్న మామిడి రైతులు దయనీయ పరిస్థితిపై ప్రభుత్వం, జిల్లా యాత్రాగం తగిన చర్యలు తీసుకొని జ్యూస్ ఫ్యాక్టరీలు, ర్యాంపుల దొపిడీ నుండీ మామిడి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆనంద నాయుడు, భారతి, తదితరులు పాల్గొన్నారు. అనతరం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలసి జిల్లాలో మామిడి రైతుల సమస్యలపై చర్చించారు.

స్విరి ప్యాకింగ్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

రూ.25 కోట్ల మేర ఆస్తి నష్టం

ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడు మండలం పాలగుంట గ్రామం వద్దనున్న స్విరి ప్యాకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో శక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రెండు గంటల పాటు మంటలు భారీ ఎత్తున చెలరేగడంతో పరిశ్రమ పరిసర ప్రాంతాల గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న జిల్లా అగ్ని మాపక అధికారి రమణయ్య సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే పరిశ్రమకు చెందిన భారీ యంత్రాలు, ముడి పదార్థం, పైకప్పు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.25 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు పరిశ్రమ యాజమాన్యం తెలిపింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని యాజమాన్యం తెలిపింది. ఈ ప్రమాదంపై మరింత స్పష్టత రావాల్సి ఉందని, ప్రమాద సమయంలో ఈ పరిశ్రమలో 60 మంది కార్మికులు ఉన్నారని, గత రెండు రోజులుగా యంత్రాలు ఆపివేసి శుభ్రపరిచే పనిలో ఉన్నట్లు తెలిపారు. మంటలు చెలరేగిన వెంటనే కార్మికులు అప్రమత్తమై బయటికి పరిగెత్తడంతో ఎలాంటి ప్రాణనష్టం చోటు చేసుకోలేదని తెలిపారు. స్విరి ప్యాకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ 2023వ సంవత్సరంలో ప్రారంభమయింది. ఈ పరిశ్రమలో టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ వంటి వస్తువుల ప్యాకింగ్‌కు ఉపయోగించే కార్డ్ బోర్డ్ పార్సెల్ ప్యాకింగ్ నమూనాలను ఉత్పత్తి జరుగుతుంది. ఈ పరిశ్రమలో దాదాపు మూడువందల మంది కార్మికులు పనిచేస్తున్నారు. గత రెండు రోజులుగా యంత్రాలు ఆపి ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటన స్థలాన్ని జిల్లా అగ్ని మాపక అధికారి రమణయ్య పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ యాజమాన్య నిర్వహణ లోపం స్పష్టంగా కనబడుతోందన్నారు. ఈ పరిశ్రమలో అగ్నిమాపక నిరోధకాలు ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించటం పట్ల పరిశ్రమలోని కార్మికులకు అవగాహన లేకపోవడంతో భారీ అగ్ని ప్రమాదం వాటిల్లిందని, యాజమాన్యానికి పెను నష్టాన్ని మిగిల్చిందన్నారు. సాధారణంగా ఏ పరిశ్రమంలోనైనా ఉత్పత్తిని వేరొక ప్రదేశానికి తరలించి అక్కడ ప్యాకింగ్ నిర్వహిస్తారని అయితే ఈ పరిశ్రమకు ఉత్పత్తి యూనిట్ లోపలే ఉత్పత్తి నిల్వలను ఉంచి వాటికి ప్యాకింగ్ నిర్వహించడం ప్రమాదంలో మరింత నష్టం తెచ్చిందన్నారు. ఉత్పత్తిలో వెలువడే వ్యర్థాలను వెంటనే తొలగించడం, దూరంగా వేయకపోవడం వంటివి ప్రధాన లోపమన్నారు. పరిశ్రమ యాజమాన్య నిర్లక్ష్యం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలపై ఏనాడు కూడా కార్మిక శాఖ దృష్టి సారించిన సందర్భాలు లేకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సత్యవేడు మండల తహశీల్దార్ రాజశేఖర్, ఆర్ఐ సురేష్ వీఆర్వోల బృందంతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.





అండర్ బ్రిడ్జి నిర్మాణ పూర్తి

ఎంపి కృషిని అభినందిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గంగాధర నెల్లూరు నియోజకవర్గం, జీడీ నెల్లూరు మండలం, వేపంజేరి సమీప ప్రాంతమైన బంగారెడ్డి పల్లె గ్రామపంచాయతీ, శెట్టిఫోరం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యకు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు చొరవతో పరిష్కారం లభించంది. దీంతో వేపంజేరి, శెట్టి ఫోరం గ్రామీణ ప్రాంతాల ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేపంజేరి, బంగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ శెట్టిఫోరం గ్రామీణ ప్రాంతాల మధ్య హైవే రోడ్డును ఏర్పాటు చేయడంతో ఆ పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రామప్రజలు తమ కార్యకలాపాలను నిర్వహించుకోలేక ఇబ్బందులు పడేవారు. వారి కష్టాలను చిత్తూరు ఎంపి దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపాలని మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎంపీ అండర్ ప్యాసేజ్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఎంపి విజ్ఞప్తిని మన్నించిన ఎన్డీఏ సర్కార్ తక్షణమే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయించింది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి రాకపోకలకు అంతరాయం లేకుండా మార్గాన్ని సుగమం చేసింది.



అండర్ ప్యాసేజ్ నిర్మాణం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

చెట్లు నరికేసి.. పచ్చదనం పడకేసి..!

- అక్రమంగా తరలిపోతున్న కలప
- వాల్టా చట్టానికి తూట్లు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -గంగవరం : గంగవరం మండలం పడమట పంచాయతీలలో వేపుగా పెరిగిన వృక్ష సంపదను కూల్చి వేస్తున్నారు. ఫలితంగా ఎండకు, వానకు చల్లని నీడనిస్తున్న పచ్చని చెట్లు అంతరించి నీడ కరువైంది. పచ్చని పొలాల మధ్య, పొలం గట్ల పక్కనే వున్న పచ్చని వాతావరణంతో కళకళలాడుతున్న వ్యవసాయ పొలాలు నేడు అందవిహీనంగా మారుతున్నాయి. ఓ పక్క ప్రభుత్వం మొక్కలు పెంచాలని ఇందుకు ప్రోత్సహిస్తున్నా వ్యాపారులు లాభార్జనే ధ్యేయంగా పచ్చని చెట్లను యథేచ్ఛ గా నరికి కలపను తరలిస్తుండడంతో పచ్చదనం కనుమరుగవుతోంది. స్పందించాల్సిన సంబంధిత అధికారులు నిద్రావస్థలో వుంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పచ్చని చెట్లు పూర్తి అంతరించే ప్రమాదం వుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెట్లు నరికేసి పచ్చదనం పడకేసి..

గంగవరం మండలం పడమట పంచాయతీలలో పాల డెయిరీలు ఇటుకల బట్టీలు ఎక్కువగా ఉన్నాయి. కొంతమంది పరిసర ప్రాంతాల వ్యవసాయ పొలాల్లో , చెరువు గట్లలో ఏపుగా పెరిగిన వృక్షాలను నరికివేసి కలపను డెయిరీలకు, ఇటుకల బట్టీలకు అందించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో వందల సంఖ్యలో వున్న చెట్లు ప్రస్తుతం పదుల సంఖ్యలో కనిపిస్తున్నాయి.

అక్రమంగా తరలిపోతున్న కలప

ఈ కలప సరఫరా యథేచ్ఛగా సాగుతోంది. మండలంలోని చౌడిరెడ్డిపల్లి ఒక్క గ్రామంలోనే కనీసం 20 మంది వ్యాపారులు చెట్లను నరికి సరఫరా చేయడం మామూలు అయిపోయింది. అధికారులు ఎవరైనా అడ్డగిస్తే వారికి మామూలు ఇచ్చి యథేచ్ఛగా పట్టపగలే కలప తరలిస్తున్నారు. పలమనేరు శంకరాలపేట రహదారి పలమనేరు నాలుగు రోడ్ల మీదుగా నిత్యం ఈ తంతు సాగుతోంది. కొంతమంది సరఫరా చేస్తున్న వారిని ప్రశ్నించగా తాము అధికారులకు నెలవారి మామూళ్లు ఇస్తున్నామని తమను ఎవరూ ఏమి అపలేరని వింతగా వాదించడం పలువురిని ఆశ్చర్య పరుస్తోంది.

వాల్టా చట్టానికి తూట్లు

ప్రభుత్వం మాత్రం పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రకరకాల పథకాలతో చెట్ల పెంపకాలను చేపడుతుతోంది. ఇటుక బట్టి నిర్వాహకులు , కలప వ్యాపారులు మాత్రం భారీ వృక్షాలను సైతం వదలకుండా ఎలాంటి అనుమతులు లేకుండా కలపను యథేచ్ఛగా తరలిస్తున్నా వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వృక్షాలను నరికివేసి తరలిస్తున్న వారిపై నిఘా ఉంచి పచ్చదనం పరిరక్షణకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


యథేచ్ఛగా కలపను తరలిస్తున్న వ్యాపారులు


షికారు విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న ప్రసాద్

షికారు విద్యార్థులకు చేయూత

ప్రజాశక్తి - వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలంలోని తిరుమలయ్య పల్లి పంచాయతీ షికారి కాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినివిద్యార్థులకు పచ్చి కాపల్లం లక్ష్మి బ్రాంచెస్ అధినేత ప్రసాద్ విద్యా సామగ్రిని వితరణ చేశారు. పాఠశాల ఉపాధ్యాయు ల కోరిక మేరకు సుమారు 45 మంది విద్యార్థులకు ఒక సంవత్స రానికి సరిపడ విద్యా సామగ్రికి 13 వేల రూపాయల నిధులు వెచ్చించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయు లు, విద్యార్థులు, తల్లిదండ్రులు లక్ష్మి బ్రాంచెస్ అధినేత ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యసాధనతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి- గంగవరం: విద్యార్థులు ఒక లక్ష్య సాధనతో ప్రణాళికను ఎంచుకొని చదివి ముందుకెళ్లాలని మదర్ థెరిసా విద్యాసంస్థల ఛైర్మన్ రవీంద్రబాబు పేర్కొన్నారు. ఆ కళాశాల ఎంబిఎ విద్యార్థులకు చదువు పూర్తయిన సందర్భంగా శనివారం ప్రత్యేక వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేసి వారికి సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా అకాడమిక్ అధికారి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తు ప్రణాళికను ఎంచుకొని పట్టుదలతో చదివి విజయాన్ని సాధించాలని అప్పుడే ఈ పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లవచ్చన్నారు. అప్పుడే తాను పుట్టిన గడ్డకు, తల్లిదండ్రులకు, చదువుకున్న కళాశాలకు పేరు ప్రఖ్యాతల తీసు కొస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రేషన్ షాపు డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్న తహశీల్దారు

రేషన్ డీలర్లు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రేషన్ డీలర్లు అందరూ ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో తప్పనిసరిగా లబ్ధిదారులకు అందుబాటులో ఉండి రేషన్ పంపిణీ సమర్థవంతంగా పంపిణీ చేయాలని తహశీల్దారు అనిల్ కుమార్ డీలర్లను ఆదేశించారు. శనివారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మండలంలోని డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి రేషన్ కార్డు దారులతో మర్యాదపూర్వకంగా రేషన్ పంపిణీ చేయాలని కోరారు. వికలాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. తప్పనిసరిగా డీలర్లు సమావేశానికి ప్రతినెల ప్రతి ఒక్కరూ హాజరుకావాలని ఆదేశించారు. ఎం ఎల్ ఎస్ పాయింట్ నుంచి వచ్చే బియ్యంలో తరుగులు వస్తున్నాయని తహశీల్దార్ అనిల్ కుమార్ దృష్టికి డీలర్లు తీసుకెళ్లగా స సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తారని డీలర్లకు తెలిపారు. తప్పనిసరిగా మన మండలం పంపిణీలో మొదటి స్థానం వచ్చేందుకు ప్రయత్నం చేయాలని అన్నారు. డీలర్లు స్టాక్ బోర్డులను ఏర్పాటుచేసి రోజువారి అమ్మకం వివరాలను నమోదు చేయాలని డిప్యూటీ తహశీల్దారు యుగేష్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్ కుమార్, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



పాలిసెట్ అర్హుల ధృవపత్రాల పరిశీలన

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ హెల్ప్ లైన్ కేంద్రంలో పాలిసెట్ అర్హుల ధృవపత్రాలను శనివారం నుండి పరిశీలిస్తున్నారు. పాలిసెట్ - 2025 లో అర్హత సాధించిన అభ్యర్థుల సహాయం కోసం పలమనేరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్ లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ బి సాయి లక్ష్మి ప్రసన్న తెలిపారు. ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుందని పేర్కొన్నారు. జూన్ 25 నుంచి 30వ తేదీ వరకు ఆన్ లైన్ ఎంపిక (వెబ్ ఆప్షన్) ప్రక్రియ వుంటుందని వివరించారు. పలమనేరు పాలిటెక్నిక్ లో జరుగుతున్న వెబ్ కౌన్సెలింగ్‌ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


బదిలీ అయిన ఆరోగ్య సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

పిహెచ్‌సి సిబ్బంది బదిలీ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సాధారణ బదిలీల్లో భాగంగా గంగాధర నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిహెచ్‌ఓ శ్రీనివాసులు కడప జిల్లా వియన్‌పల్లి, సిబ్బంది శైల గుడిపాల, ధర్మేంద్ర పూతలపట్టు, జయకుమార్ ఎన్ఆర్ పేట పిహెచ్‌సిలకు బదిలీ అయ్యారు. డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గురు ప్రకాష్, ఆరోగ్య సిబ్బంది వీరి సేవలను గుర్తించి శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. బదిలీపై వెళ్లిన వారిని శాలువాతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.


కుప్పం లో

పర్యావరణాన్ని కాపాడుదాం..

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : పర్యా వరణాన్ని కాపాడా ల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై వుంద ని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ చిదంబరం పేర్కొన్నారు. 'స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడవ శనివారం నిర్వహించాల్సిన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎల్ బి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్రమైన ముప్పు వాటిల్లు తోందని, అలాంటి ప్లాస్టిక్ వినియోగా న్ని తగ్గించా లన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటి, విద్యార్థులు, అధ్యాపకులు పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి నారాయణ మూర్తి, డాక్టర్ సి. రాజ్యలక్ష్మి, డాక్టర్ కే మాధవి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పెద్దపంజాణిలో

పెద్దపంజాణి: పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటాలని మానవ మను గడకు పర్యావరణం దోహద పడుతుందని ఎంపీడీవో బాలాజీ, తహశీ ల్దారు అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పెద్దపంజాణి తహశీల్దారు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగం గా పరిసరాల పరిశుభ్రం చేయడంతో పాటు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు తోడ్ప డాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు యోగేష్, ఈఓపిఆర్డి శారదా దేవి, వెలుగు ఏపిఎం మీరాబాయి,ఉపాధి ఏపీవో మురుగేషన్, వీఆర్వోలు సర్వేయర్లు, తహశీల్దారు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి లత, మహిళా సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

కంచర్ల రామయ్య అంతిమ యాత్ర

ప్రజాశక్తి- కుప్పం రూరల్ :

ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్య గురువారం తుది శ్వాస విడిచిన సంగతి విదితమే. ఆయన అంత్యక్రియలను హిందూ సంప్రదాయ పద్ధతిలో ప్రకాశం జిల్లా కందుకూరులో శనివారం నిర్వహించారు. ఈ అంత్యక్రియలలో కుప్పం తెలుగు తమ్ముళ్లు పాల్గొని, ఆయన భౌతిక దేహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కడా కమిటీ సభ్యులు డాక్టర్ సురేష్ బాబు సతీష్ సమేతంగా పాల్గొనగా, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, రాజారామ్, టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమర్నాథ్, నాయకులు కందస్వామి, రవి, మళ్ళానూరు కల్లై, బాలాజీ, కదిరిప్ప పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలను కొనసాగించాలి..

మైనార్టీల నిరసన

ప్రజాశక్తి - వికోట : మండల పరిధిలోని నెర్నపల్లిలో ప్రస్తుతం వున్న ఉర్దూ పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని కోరుతూ ముస్లిం మైనార్టీలు స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. నెర్నపల్లి పంచాయతీ కేంద్రంలో దశాబ్ద కాలంగా కొనసాగుతున్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఇటీవల మోడల్ స్కూల్ గా ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న గ్రామంలో ఉర్దూ పాఠశాల లేకపోతే తమ విద్యార్థుల పరిస్థితి ఏమిటి?' అని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలకు సరైన సమాచారం చెప్పకనే వారి వద్ద సంతకాలు తీసుకుని మోడల్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడం పట్ల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామస్తులు ఎంఆర్‌సి కార్యాలయం ఎదుట నిరసన తెలిపి మా గ్రామంలో యధావిధిగా ఉర్దూ పాఠశాల కొనసాగేందుకు చర్యలు చేపట్టాలని వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి మా గ్రామంలో యథావిధిగా చూపాలని వారి కోరారు.


ఉర్దూ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మైనార్టీలు

'యువత పోరు' పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-సోమల:

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా యువతకు ఇస్తానన్న ఉపాధి, ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తానని ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని నిరసిస్తూ వైసిపి కార్యవర్గం ఆదేశాల మేరకు ఈనెల 23వ తేదీ సోమవారం ఉదయం తొమ్మిది గంటల 30 నిమిషాలకు చిత్తూరు కలెక్టరేట్ వద్ద చేపట్ట నున్న 'యువత పోరు'ను జయప్రదం చేయాలని కోరారు. దీనికి సంబం ధించిన గోడ ప్రతికను శనివారం కందూరులో వైసిపి నాయకు లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం నాయకులు కిరణ్ , వెంకటరమణ, లక్ష్మీపతి, భాస్కర్ నాయుడు, శివ, శ్రీకాంత్, రాజు, నవీన్, అనిల్, వినోద్, సైషా వల్లి, ఇమ్రాన్ పేర్కొన్నారు.


యువత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

కూటమి ప్రభుత్వంలో పాడి రైతులకు తోడ్పాటు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: కూటమి ప్రభుత్వంలో పాడి రైతులకు అన్ని విధాల చేయూత అందిస్తున్నట్లు పార్లమెంట్ టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రం గంగాధర నెల్లూరు పశుసంవర్థక శాఖ ఏడి కార్యాలయంలో శనివారం పలువురి రైతులకు సబ్సిడీతో పశువుల దాణా బస్తాలను అధికారులు, నేతలతో కలిసి కృష్ణమ నాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి ఆవుల కోసం గోకులం షెడ్ లు రైతులకు మంజూరు చేయగా, వాటి దాహార్తి తీర్చడానికి పలు గ్రామాల్లో నీటి తొట్టెలు ఎక్కువ సంఖ్యలో మంజూరు చేసి వాటిని నిర్మించి ప్రభుత్వం అన్ని విధాల చేయూత అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్‌ఛార్జి డిడి అబ్దుల్ ఆరిఫ్, గంగాధర నెల్లూరు ఏడి మురళీమోహన్, టిడిపి నేతలు శ్రీధర్ యాదవ్ ,స్వామి దాస్ , దేవ సుందరం, హరీష్ యాదవ్, మోహన్ నాయుడు, అశోక్ నాయుడు, దేవరాజు రెడ్డి, దాసర పల్లి శంకర్, పశువైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.


సబ్సిడీ పశువుల దాణా పంపిణీ చేస్తున్న టిడిపి నాయకుడు కృష్ణమనాయుడు

మామిడి కాయల లారీ బోల్తా

తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి -కార్వేటినగరం:

మామిడికాయల లారీ బోల్తా పడిన సంఘటన మండల కేంద్రానికి కూత వేటులోని చిన్నకనుమ మలుపు వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..పచ్చికాపల్ల వైపు నుంచి కార్వేటినగరం వైపు మామిడి కాయల లోడ్డుతో వస్తున్న లారీ చిన్నకనుమ మలుపు వద్ద అదుపు తప్పి 10 అడుగుల పల్లంలోకి బోల్తా పడింది. దీంతో లారీలోని కాయలు చెల్లాచెదు రయ్యాయి. దీంతో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మార్గంలో తమిళనాడు నుంచి తిరుపతికి నిత్యం ప్రయాణికులతో బస్సులు, ఆటోలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదకరంగా ఉన్న చిన్నకనుమ మలుపు వద్ద అనేక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటూ ప్రా ణా లు కోల్పోయిన సందర్భా లు అనేకం వున్నాయని అధికారులు స్పందించి చిన్నకనుమ మలుపు వద్ద చూచిక బోర్డు ఏర్పాటు చేసి, ప్రమా దాల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు అంటున్నారు.



క్రైం న్యూస్

నిందితుడిపై పీడీ యాక్టు

కడప సెంట్రల్ జైలుకు తరలింపు


నిందితుడు మావిళ్ల కళ్యాణ్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-పలమనేరు: గతంలో పది నేరాలలో నిందితుడిగా వున్న ఓ వ్యక్తిపై పీడీ యాక్టు నమోదు చేసి జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ మేరకు కడప సెంట్రల్ జైలుకు తరలించామని పలమనేరు డిఎస్పి డేగల ప్రభాకర్ తెలిపారు. శనివారం డిఎస్పి విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పలమనేరు టౌన్ మండలం జావిలి స్ట్రీట్, లోని మావిళ్ల గోపి కుమారుడు మావిళ్ల కళ్యాణ్ (27)పై పీడీ యాక్టు నమోదు చేశామని తెలిపారు. ఈ వ్యక్తి గతంలో నిర్వహించిన పలమనేరు గంగ జాతర సందర్భంగా ఓ యువకుడుపై చోటు చేసుకున్న హత్యాయత్నం కేసులో నిందితుడు, పలమనేరు అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు పది నేరాలలో నిందితుడిగా వున్న కారణంగా చిత్తూరు కలెక్టర్ ప్రొసీడింగ్స్ మేరకు కళ్యాణ్‌పై పీడీ చట్టం నమోదు చేసి, కడప సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు. ఎవరైనా మద్యం కేసులు, గంజాయి కేసులు, ఇతర గొడవల కేసుల్లో పలు (అనేక) కేసులలో ప్రమేయం వున్నా వారిపైనా ఇలాంటి చట్టం నమోదు చేస్తామని హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.లక్ష జరిమానా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పది మంది పట్టుపడ్డారని వారిని కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి ఒక్కొక్కరికి పది వేల రూపాయలు చొప్పున లక్ష రూపాయలు జరిమాన విధించారని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు శనివారం తెలిపారు. ఈ ఏడాది ఆరు నెలల వ్యవధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 1,611 మందికి సుమారు 1 కోటి 61 లక్షల 12 వేల(1,61,12,000) రూపాయల జరిమాన విధించారని చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అలా పాటించని వారు భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు పేర్కొన్నారు.

చిత్తూరు అర్బన్ : వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో డ్రంక్అండ్ డ్రైవ్ కేసుల్లో 19 మంది వ్యక్తులు పట్టుబడ్డారని, వారిని రెండవ తరగతి మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా మొత్తం 82 వేల రూపాయలు జరిమాన విధించారని వన్‌టౌన్ సిఐ మహేశ్వర శనివారం పేర్కొన్నారు. పట్టుబడ్డ 19 మందిలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన ఏడుగురికి రూ.70 వేలు జరిమానా, బహిరంగంగా మద్యం తాగిన 12 మందికి రూ.12 వేలు జరిమాన విధించారని తెలిపారు. మొత్తం రూ.82 వేలు జరిమాన విధించారని వన్‌టౌన్ సిఐ మహేశ్వర్ పేర్కొన్నారు.



పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితురాలు

మహిళపై దాడి

ఒకరిపై కేసు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం :

ఓ మహిళపై దాడి చేయడంతో కేసు నమోదుచేసిన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..పుల్లూరు క్రాస్ రోడ్ లో జయచంద్ర నాయుడు భార్య నాగవేణి(68) అనే మహిళపై అదే గ్రామానికి చెందిన చంగళ రాయలు నాయుడు కొడుకు దిలీప్ నాయుడు (75) దాడి చేశాడని నాగవేణి ఎస్ఆర్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్ఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు . రాత్రి నాగవేణి వారి వీధిలో విద్యుత్ స్తంభాన్ని ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారికి చెప్పి కరెంట్ పోల్ పెట్టించిందని, అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చిందని ఈ విద్యుత్ స్తంభం దిలీప్ నాయుడు భూమికి ఆ స్తంభం అడ్డంగా వుందని కోపంతో మాటా మాట పెరిగి నాగవేణి పై అసభ్యంగా ప్రవర్తించాడని, చీర, జాకెట్‌ను చించి అవమానపరిచినట్లు ఆమె ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జయరాం కేసు నమోదు చేసినట్లు ఎస్ఆర్ పురం పోలీసులు తెలిపారు.


మరమ్మతులకు నోచుకోని కాలిపోయిన బోరు మోటారు

బోరు మోటారు ఇలా..తాగునీరు అందేది ఎలా..?

- మూడు రోజుల క్రితం కాలిపోయిన మోటారు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి- సోమల:

మండల కేంద్రమైన సోమల బజారు వీధిలోని జామ మాను వద్ద ఉన్న రక్షిత మంచినీటి సరఫరా బోరు మోటారు మూడు రోజుల క్రితం కాలి పోయింది. పంచాయతీ అధికారులు స్పందించక పోవడంతో ఆ గ్రామ ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీపంలోని శివా లయం వద్ద నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని వాపో తున్నారు. గ్రామంలో 30 కుటుంబాలు నివసిస్తు న్నాయి. వారికి బోరు బావి వద్దే ట్యాంకు ఏర్పాటు చేసి ట్యాంకు నింపి నీటిని ఇంటింటికీ డైరెక్టర్ పంపింగ్ ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే మూడు రోజుల క్రితం బోరు మోటారు కాలిపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. తాగునీరు పైపుల ద్వారా సరఫరా కాకపోవడంతో సమీప రక్షిత మంచినీటి బోరు మోటార్ల వద్ద నీటిని తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఎక్కువ మంది రైతు కుటుంబాల వారు వుండడంతో పగలు పొలం పనులకు వెళ్లి కష్టించి వచ్చి సాయంత్రం విశ్రాంతి తీసుకునే తాము నీటిని దూరం వెళ్లి తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా వుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి సమస్యను గుర్తించి వెంటనే బోరు మోటారుకు మరమ్మతులు చేయించి తాగునీటిని అందించి సమస్యను పరిష్కరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.